క్లుప్తంగా

నాణ్యత పరిశీలన



రోడ్డు నాణ్యతాప్రమాణాలను పరిశీలిస్తున్న అధికారులు

సారవకోట: మండల కేంద్రం నుంచి చోడసముద్రం మీదుగా కిడిమి వరకు నిర్మించిన రహదారి నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది ఆదివారం పరిశీలించారు. ప్రధాన మంత్రి సడక్ యోజన పథకం ద్వారా సుమారు రూ 1.84 కోట్లతో ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులను క్వాలిటీ కంట్రోల్ మోనటరింగ్ అధికారి పురుషోత్తమరావు నాణ్యతను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నారు. పంచాయతీ రాజ్ డీఈఈ వెంకటరావు, ఏఈ కోదండరావు ఉన్నారు.

ముమ్మరంగా ఇంటింటా కుళాయి పనులు



గాడీలు తవ్వుతున్న దృశ్యం

కొత్తూరు: మండల కేంద్రంలో ఇంటింటా కుళాయి పైపులైన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవతో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా కొత్తూరు పంచాయతీకి రూ.2.20 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు స్థానిక సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు తెలిపారు. గత 15 రోజుల నుంచి పంచాయతీ లోని పలు వీధుల్లో పైపులైన్లు వేసేందుకు గాడీల తవ్వకాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పనులు పూర్తయితే పంచాయతీ పరిధిలోని సుమారు 3 వేల ఇళ్లకు తాగునీరు పూర్తిస్థాయిలో అందుతుందన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ప్రభుత్వ భవనాలు



కట్యాచార్యులపేట గ్రామ సచివాలయం

ఆమదాలవలస రూరల్: మండలంలో కట్యాచార్యులపేట గ్రామంలో గ్రామ సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన అందించే కార్యక్రమంలో భాగంగా పలు కార్యాలయాలను గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం మూడు ఒకేచోట నిర్మాణాలు చేపట్టడం వలన అన్ని ప్రభుత్వ సేవలు సులభతరం కానున్నావని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

287 మందికి వైద్య పరీక్షలు



వైద్య సేవలు అందిస్తున్న వైద్యుడు సురేష్

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామంలో బెహరా సతీష్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం పట్టణానికి చెందిన వైద్యుడు బి.సురేష్ 287 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కొరసవాడ, కాగువాడ, బూరగాం గ్రామాలకు చెందిన రోగులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. మండల సలహాదారుడు ఎం.గణపతి, కర్రి లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులపై అప్రమత్తత అవసరం

కొత్తూరు: అపరచిత వ్యక్తులు నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మురపాక గోవింద తెలిపారు. ఆదివారం కొత్తూరులో మాట్లాడారు. ఉపాధ్యాయుల పేరు చెప్పి డబ్బులు అడగడంతో కొంతమంది వారిపై ఉన్న గౌరవం, నమ్మకంతో రూ.వేలల్లో ఇస్తున్న వైనం గ్రామాల్లో జరుగుతుందన్నారు. ఇటీవల కొత్తూరు, హిరమండలం మండలాల్లో ఇటువంటివి రెండు సంఘటనలు జరిగాయన్నారు. పరిచయం లేని వ్యక్తులు ఇంటికి వచ్చి డబ్బులు అడిగినా, ఫోన్ పే చేయమన్నా అలా చేయవద్దన్నారు. డబ్బులు అడగమన్న వ్యక్తికి ఫోన్ చేసి నిర్ధారణ చేసుకోవాలన్నారు. కొంతమంది దుండగులు డబ్బులు కాజేసేందుకు ఇటువంటి చర్యలకు దిగుతున్నారన్నారు. అపరిచిత వ్యక్తులతో మాట్లాడటం, పరిచయాలు పెంచుకోవద్దన్నారు. మోసం చేస్తున్నట్లు గుర్తిస్తే పట్టుకొని పోలీస్‌లకు, సచివాలయం మహిళా పోలీస్‌లకు అప్పగించాలన్నారు.

శ్రీముఖలింగంలో కోలాటం



జలుమూరు మండల కేంద్రంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో మాఘమాసం ద్వాదశ పురస్కరించుకుని ఆదివారం నరసన్నపేటకు చెందిన బాలికలతో కోలాటం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు భక్తి గీతాలు అలపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

\- జలుమూరు

జ్ఞాపకాల ఒడిలో..

సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1979-80లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ నాడు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

\- సారవకోట



సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం



పోలాకి: సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ధర్మాన కృష్ణదాస్

- ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి
- గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

పోలాకి: రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం గాతలవలస సచివాలయం పరిధిలోని దువ్వవలస, కొండకొత్తపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామాల్లో సచివాలయవ్యవస్థ ఏర్పాటు చేసి గాంధీజీ చెప్పిన గ్రామస్వరాజ్యం తెచ్చిపెట్టిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కిందన్నారు. భూముల రీసర్వేతోపాటు పేదలకు సంక్షేమ పథకాల అమలు, పారదర్శక విధానాలు, గ్రామాలకు రహదారుల సదుపాయాలు, నాడు-నేడు ద్వారా బడులు, ఆస్పత్రుల ఆధునీకరణ ఇవన్నీ అభివృద్ధికి సూచికలన్నారు. సీఎం జగన్ చెప్పిందే చేస్తారని.. చేసిందే చెప్తారంటూ ఉత్సాహంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, మాజీ ఎంపీపీ దుంపల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

పాతపట్నం: ఈ మూడున్నరేళ్లలో ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన ప్రయోజనాన్ని ప్రజలకు తెలియజేస్తున్నామని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం-1 గ్రామ సచివాలయ పరిధిలోని పిల్లివీధి, గాంధీవీధి, రెల్లివీధి, ఎస్సీ కాలనీ, దేవాంగులవీధి, ఉప్పరవీధుల్లో ఆదివారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకుంటూ.. ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులకు చేకూర్చిన ప్రయోజనాన్ని వివరిస్తూ సీఎం జగన్ రాసిన లేఖను ఆయా కుటుంబాలకు అందజేశారు. జగనన్న కాలనీలు కావాలని పలువురు మహిళలు ఎమ్మెల్యేను కోరారు. రెండో విడతలో జగనన్న కాలనీలను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎస్సీ వీధిలో విద్యుత్ స్తంభం, సీసీ రోడ్డు కావాలని పలురువు మహిళలు ఎమ్మెల్యేను కోరగా.. మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్ సుందరావు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు కె.అర్జునుడు, తాతయ్య, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్, మండల సలహాదారుడు ఎం.గణపతి, ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, గేదెల సూర్యం, కర్రి లక్ష్మీనారాయణ, జి.రాము, శవ్వాన మురళీధరావు, ప్రహల్లాద పుల్లాయ్, డకర చిన్నారావు, తూలుగు ప్రవీణ్, ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్, ఏఓ అప్పలనాయుడు, ఏపీఎం మనోరత్నం, ఏపీఓ సురేష్, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, వైఎస్సార్‌సీపీ నాయకులు దొర పార్వతీశం, ఎనుగుతల సూర్యం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పాతపట్నం: పాతపట్నం ఎస్సీ వీధిలో ఎమ్మెల్యే రెడ్డి శాంతికి సమస్యలు వివరిస్తున్న మహిళ

ఉన్నత లక్ష్యం ఏర్పరుచుకోవాలి



విజేతలతో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు, తదితరులు

జలుమూరు: విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్య సాధనకు ఇష్టంతో చదివితే విజయం సులువుగా సొంతం అవుతుందని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. ఆదివారం కరవంజ మోడల్ స్కూల్‌లో దేసూల విజయగౌరీ జ్ఞాపకార్థం పీఆర్‌టీయూ నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్షలో విజయ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించి మాట్లాడారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో రావాడ శిరీష (కరవంజ మోడల్ స్కూల్), సవలాపురపు చరణ్(కరవంజ మోడల్ స్కూల్), చెంచల ప్రవీణ్‌తోపాటు ప్రోత్సాహక బహుమతులు కంబాకాయ, బుడితి పాఠశాల విద్యార్థులకు అందించారు. ప్రిన్సిపాల్ డి.గణేష్ పట్నాయక్, పీఆర్‌టీయూ ప్రతినిధులు బైరి అప్పారావు, దానేటి కేశవరావు, సర్పంచ్ జుత్తు నేతాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

ఎల్.ఎన్.పేట: ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా చదవాలని గ్రూప్-2 విజేత ఎం.వి.రమణమూర్తి అన్నారు. మండలంలోని డొంకల బడివంజ గ్రామంలోని ప్రజా గ్రంథాలయంలో ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు అధ్యక్షతన ఆదివారం విద్యార్థులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇష్టపడి చదివితే విషయం అర్థం అవుతుందన్నారు. పరీక్షలంటే భయం పోవాలని, నేను పరీక్ష రాయగలను, విజయం సాధించగలనన్న పట్టుదల ఉండాలన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు చెప్పింది విని విద్యార్థికి అర్థమయ్యేలా నోట్సు తయారు చేసుకోవాలన్నారు. నేర్చుకోవాలన్న తపన పెరగాలన్నారు. టెస్ సంస్థ అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు, సభ్యుడు రామశంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణమూర్తి

ఆహార పొట్లాల పంపిణీ

ఆమదాలవలస: చేయి చేయి కలుపుదాం సేవా సంఘం తరఫున ఆమదాలవలస రైల్వేస్టేషన్, బస్టాండ్, రామ మందిరం తదిర ప్రాంతాల్లో ఉంటున్న పేదలు, యాచకులకు ఆదివారం ఆహార పొట్లాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రతీ ఆదివారం ఆమదాలవలస, నరసన్నపేట, శ్రీకాకుళంటౌన్, రాగోలు జెమ్స్ ఆస్పత్రి ప్రాంతాల్లో ఆహార పొట్లాల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు సంఘం ప్రెసిడెంట్ సీపాన సంతోష్ తెలిపారు. పేదలకు ఆహారం పంపిణీ చేసేందుకు ఎవరికైనా అవసరం అయితే సెల్ నంబర్ 9618810090కు ఫోన్ చేస్తే అందజేస్తామన్నారు. సంఘం ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. సంఘం జనరల్ సెక్రటరీ బి.వినోద్‌కుమార్, ట్రెజరర్ పి.వి.జె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విష్ణుమూర్తికి పరామర్శ

ఎల్.ఎన్.పేట: వైఎస్సార్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ సీనియర్ నాయకుడు పెనుమజ్జి విష్ణుమూర్తిని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం పరామర్శించారు. కొన్ని రోజుల క్రితం విష్ణుమూర్తి గుండె సంబంధిత సర్జరీ చేసుకున్నారు. యంబరాంలోని తన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విష్ణుమూర్తిని ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో మరింత చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.



విష్ణుమూర్తిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

వీనులవిందుగా పంచరత్న కీర్తనలు



త్యాగరాజు చిత్రపటంతో నగర సంకీర్తన

శ్రీకాకుళం కల్చరల్: త్యాగయ్య రచించి గానం చేసిన పంచరత్న కీర్తనల గానం వీనుల విందుగా సాగింది. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో కచ్చపి కళా క్షేత్రం ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు, దశమ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. యనమండ్ర శ్రీనివాసశర్మ, దూసి కనకమహాలక్ష్మి, కరి యామినీకృష్ణ, నుసరావు లక్ష్మీగణపతి శర్మ బృందం కీర్తనలను చక్కగా గానం చేశారు. ముందుగా పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయం నుంచి బాపూజీ కళామందిర్ వరకు త్యాగరాజస్వామి చిత్రపటంతో నగర సంకీర్తన సాగింది. అపర్ణ బృందంచే కోలాట ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం నాదసమ్మేళన కార్యక్రమంలో వై.శ్రీనివాసశర్మ కీర్తనలను గానం చేశారు. కార్యక్రమంలో బంకుపల్లి దుర్గా శ్రీనివాసశర్మ, మావుదూరు సూర్యప్రసాదరావు, మావుడూరు సత్యనారాయణశర్మ, ఇనపకుర్తి మన్మధరావు, దూసిరమేష్, దుంపల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పంచరత్న కీర్తనలను గానం చేస్తున్న దృశ్యం


ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రసంగం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీనాథుడు, తెనాలి రామకృష్ణ, చామకూర వెంకటకవులు, శ్రీరంగనాథుడు తమ రచనలలో శైలి, నైపుణ్యత, చమత్కారాలను అద్భుతంగా పండించారని డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో ఆదివారం కవితా చతురత అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం వక్తను సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ కోమలరావు, మందుల మోహనరావు, ఎం.శ్రీనివాసరావు, కె.చంద్రరావు, అరుణకుమారి, విశ్వేశ్వరరావు, బాబూరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

మామిడి కాదు.. బొప్పాయి



ఈ చిత్రంలో ఉన్నది మామిడి పండు ఆకారంలో ఉన్న బొప్పాయి. కొత్తూరు మండల కేంద్రానికి చెందిన గేదెల తిరుపతిరావుకు చెందిన బొప్పాయి తోటలో ఆదివారం ఈ దృశ్యం కనిపించింది.

\- కొత్తూరు

నేడు తిమ్మాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

ఆమదాలవలస: స్థానిక మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు తిమ్మాపురం గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు స్పీకర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాం పాల్గొంటారన్నారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు మాకివలసలో..

జలుమూరు: గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం మాకివలసలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ వాన గోపి ఆదివారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని కోరారు.

వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి

కొత్తూరు: మండలంలోని కురిగాం గ్రామ సచివాలయం పరిధి అల్తి గిరిజన పంచాయతీలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించాలని సర్పంచ్ ఎస్.ఏలేశ్వరి డీఎంహెచ్ఓకు కోరారు. ఈ మేరకు ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. కురిగాం పీహెచ్‌సీకి అల్తి పంచాయతీ దగ్గరలో ఉందన్న భావంతో ఇటీవల కొద్ది రోజులుగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం లేదన్నారు. కురిగాం పీహెచ్‌సీకి చేరుకోవాలంటే కొండలపై నుంచి సుమారు 8 కిలో మీటర్లు ప్రయాణించాల్సిస్తుందన్నారు. 104 వాహనం రాకపోవడంతో అల్తి పంచాయతీలో ఉన్న 12 గిరిజన గూడలకు చెందిన సుమారు 1,600 మంది గిరిజనులకు వైద్య సేవలు సకాలంలో అందక అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. అధికారులు స్పందించి అల్తి పంచాయతీ పరిధి తామరగూడలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించాలని కోరారు.

విస్తారంగా రబీ సాగు



జొన్నవలసలో సాగు చేస్తున్న చోడి పంట

ఆమదాలవలస రూరల్: మండలంలో రామచంద్రాపురం, జొన్నవలస, సైలాడ, దూసి, తమ్మయ్యపేట, కొత్తవలస, చీమలవలస తదితర గ్రామాల్లో రబీ పంటలను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. రబీ సాగులో భాగంగా రాగులు (చోడి), మొక్కజొన్న, నువ్వు తదితర పంటలను వేశారు. రబీ పంటలకు అనుకూలంగా సాగునీటి కాలువల ద్వారా నీటిని పుష్కలంగా విడుదల చేయడంతో రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నట్లు చెబుతున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే మంచి దిగుబడులు వస్తావని రైతులు అంచనా వేస్తున్నారు.

నేడు బడ్జెట్ సమావేశం

బూర్జ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటలకు బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

ఎంపీపీ కర్నేన దీప అధ్యక్షతన మండల అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు.

నేడు కాశీవిశ్వేశ్వర స్వామి కల్యాణం

బూర్జ: మండలంలోని మధనాపురం గ్రామంలో (జగన్నథపురం) గల అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని (ఆలయ 6వ వార్షికోత్సవం) మంగళవారం నిర్వహించనున్నారు. గ్రామ పురోహితులు బ్రహ్మశ్రీ నేతేటి శ్రీనివాస శర్మ, ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ బంకుపల్లి శివ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో తుడ్డలి గ్రామస్తులు శ్రీనివాసరావు, నలిని దంపతులు, కుమారులతో శివ పార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన (నారాయణ సేవ) నిర్వహించనున్నారు. పౌరానిక నాటకాలు ప్రదర్శించనున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, ప్రజలు పాల్గొనున్నారు.

కుక్కల బెడద

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతుంది. అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. చేపల మార్కెట్, చికెన్ దుకాణాల వద్ద కుక్కలు గాయపరుస్తున్నాయి. వాహనదారులు వేగంగా వస్తున్న సమయంలో కుక్కల గుంపులు రోడ్లపై రావటంతో వాహనదారులు, స్థానికులు ఆందోళనకు లోనవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు వీధుల్లోకి రావాలంటే భయపడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



మండల కేంద్రంలో గుంపుగా కుక్కల సంచారం

కింతలి నుంచి సంప్రదాయ గురుకులానికి బస్సు

శ్రీకాకుళం కల్చరల్: కల్లేపల్లిలోని సంప్రదాయ కూచిపూడి గురుకులానికి కింతలి గ్రామం నుంచి బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు సంప్రదాయం డైరెక్టర్ స్వాతిసోమనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి ఎస్‌వీ యూనివర్సిటీకి అనుబంధంగా నడుస్తున్న ఈ గురుకులంలో కూచిపూడి నృత్యం నేర్చుకునే అభిలాష ఉండే విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రతిరోజూ సాయంత్రం 4.30 గంటలకు కింతలి గ్రామంలో బస్సు బయలుదేరుతుందని, ఈ రూట్‌లో వచ్చే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవా లని కోరారు. పూర్తి వివరాలకు 9440681083, 7731909837 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.